సాక్షి
కృష్ణాజిల్లా

ఆదివారం । 23 । మార్చి । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌కు చెందిన వెంకటనాగేశ్వరరావు కుటుంబం రూ.లక్ష విరాళం అందజేసింది.



సుబ్రహ్మణ్యుని సన్నిధిలో..

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణాజిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రవినాథ్ తిల్‌హరి శనివారం దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
విజయవాడ	6.24	4.52
మచిలీపట్నం	6.23	4.49

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 78వ గణతంత్ర దినోత్సవంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో ఏపీ ప్రీ రిపబ్లిక్ పరేడ్ కంటిన్జెంట్ లీడర్, ఎన్టీఆర్ జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టు అవసరమే



నున్న(విజయవాడరూరల్): ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలని భూగర్భ జల, జల గణన శాఖ సహాయ సంచాలకుడు సీహెచ్ వెంకటరావు సూచించారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా నున్నలో మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్ (వెస్ట్)లో నీటి పొదుపునకు అనుసరించాల్సిన కార్యాచరణపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నీటి పొదుపు, సంరక్షించుకోవాల్సిన విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాతావరణ సమతుల్యత నీరు, చెట్లతో ఏర్పడుతుందన్నారు. హిమనీ నదాల పాత్రపై విద్యార్థులకు జలచక్రం ద్వారా వివరించారు. నీటి సంరక్షణపై ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు భారతి, అధికారులు అశోక్, ఎంఎన్ వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఓబీసీల చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి

ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఓబీసీల ప్రధాన డిమాండ్లపై జాతీయ స్థాయిలో ఈనెల 24, 25, 26 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు బీసీ సమాజానికి పిలుపునిచ్చారు. విజయవాడలోని సంఘ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈసారి చేసే జనగణనతో పాటు సమగ్ర కులగణన చేయాలన్నారు. జనాభా దామాషా మేరకు చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని, ఓబీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ సవరణ చేయాలనే పలు డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంవీవీఎస్ మూర్తి, మేకా వెంకటేశ్వరరావు, చిప్పాడ చందు, అండలూరి ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు తాపడం పనులకు రూ. 1.51 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు ఏలూరు జిల్లాకు చెందిన భక్తులు శనివారం రూ. 1.51 లక్షల విరాళాన్ని అందజేశారు. ఏలూరు జిల్లా పూళ్లకు చెందిన ఎనికేపల్లి శ్రీనివాసరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. శ్రీనివాసరావు బంగారు తాపడం పనులకు రూ.1,51,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

వైద్యానికి వైరస్!

- ప్రజారోగ్యం గాలికి
- పల్లెల్లో వైద్యం దయనీయం
- '108' కుయ్యో.. మొర్రో
- నిలిచిన '104' సేవలు
- దీర్ఘకాలిక రోగులకు ఇక్కట్లు
- గత ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం

రాష్ట్రంలో వైద్యరంగానికి వైరస్ వచ్చింది. కూటమి పాలకులు ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు. ప్రభుత్వాస్పత్రులను నిర్వీర్యం చేశారు. 'ఆరోగ్య సేవ'లను అధ్వానంగా మార్చేశారు. గత ప్రభుత్వంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందితే.. ప్రస్తుతం పది నెలల కూటమి పాలనకు నిదర్శనం ప్రజారోగ్య వ్యవస్థ 'ఐసీయూ'కు చేరడమే.

లబ్బీపేట(విజయవాడతూర్పు): కూటమి పాలనలో గ్రామీణ వైద్య సేవలు దయనీయంగా మారాయి. నాణ్యమైన వైద్యంపై పేదలకు భరోసా కరువైంది. ఆరోగ్య కార్యక్రమాలు 'ఐసీయూ' బాట పట్టాయి. దీర్ఘకాలిక రోగులు నానాపాట్లు పడుతున్నారు. మంచానికే పరిమితమైన వారికి వైద్యం దూరమైంది.

పురిటి నొప్పులు వచ్చినా.. ప్రమాదంలో గాయాలు , ఇతర అనారోగ్యానికి గురైనా ఒక్క ఫోన్ కాల్ చేస్తే కుయ్.. కుయ్..కుయ్ అంటూ వచ్చే '108' వాహనాలు కుయ్యో..మొర్రో అంటున్నాయి. పదిహేను రోజులకు ఒకసారి గ్రామానికి వచ్చి వైద్య సేవలు అందించే 104 వాహనాలు ఆచూకీ లేకుండా పోయాయి. అన్ని సేవలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం తామేదో గొప్పగా సేవలు అందిస్తున్నట్లు ఊదరగొడుతూ ప్రజలను మభ్యపెట్టడానికి కుటిల యత్నాలు చేస్తోంది.



గత ప్రభుత్వంలో.. నడవలేని స్థితిలో ఉన్న రోగి ఇంటికే వెళ్లి పరీక్ష చేస్తున్న వైద్యుడు(ఫైల్)

కదల్లేని స్థితిలో '108'

ఎన్టీఆర్ జిల్లాలో 24, కృష్ణాలో 29 '108' వాహనాలు ఉన్నాయి. ఇవి కొంతకాలంగా మరమ్మతులకు గురవుతున్నాయి. రోగులను వేగంగా ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సిన వాహనాలు కుయ్యో.. మొర్రో అంటూ కదులుతున్నాయి. అంతేకాదు ఒక్కోరోజు మరమ్మతులకు గురై, డీజిల్ లేక వాహనాలు నిలిపివేసిన సందర్భాలు ఉన్నాయి. వాటిలో పనిచేసే డ్రైవర్లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్(ఇఎంటీ)లకు వేతనాలను సక్రమంగా చెల్లించడం లేదు. అందుకు ప్రభుత్వ వైఖరే కారణమని వారు వాపోతున్నారు.



గత ప్రభుత్వంలో.. ఆరోగ్య సురక్షలో గ్రామానికి వెళ్లి పరీక్ష చేస్తున్న స్పెషలిస్టు వైద్యురాలు(ఫైల్)

పడకేసిన '104'

మారుమూల గ్రామాలకు సైతం 'కుటుంబ డాక్టర్'(ఫ్యామిలీ ఫిజీషియన్) ద్వారా పదిహేను రోజులకు ఒకసారి వెళ్లి వైద్య సేవలు అందించిన '104' వాహనాల సేవలు పడకేశాయి. గతంలో ప్రతి గ్రామాన్ని మ్యాపింగ్ చేసి, ఎంపిక చేసిన తేదీల్లో వైద్యులు, సిబ్బంది వెళ్లి సేవలు అందించేవారు. మంచాన ఉన్న రోగుల ఇళ్లకే వైద్యులు వెళ్లేవారు. పాఠశాలలకు, అంగన్‌వాడీలకు వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కలిగించేవారు. ఇప్పుడు అలాంటి కార్యక్రమాలు ఏవీ కొనసాగడం లేదు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది, సీహెచ్‌ఓలు మొక్కుబడిగా వైద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నాడు ఆరోగ్య సురక్షతో భరోసా

దేశంలోనే తొలిసారిగా గత ప్రభుత్వంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. స్పెషలిస్టు వైద్యులనే గ్రామాలకు పంపించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడే పరీక్షలు చేసి ఆస్పత్రిలో వైద్యం అందించాల్సి ఉంటే మెరుగైన వైద్యానికి జీజీహెచ్‌కు తరలించారు. ఆ రోగి జీజీహెచ్ నుంచి డిశ్చార్జి అయ్యే వరకూ ఆరోగ్య సిబ్బంది ఫాలోఅప్ చేస్తూ ఉండేవారు. వైద్య శిబిరాల్లో అన్ని రకాల మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహించారు.

దీర్ఘకాలిక రోగుల ఇబ్బందులు

ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా కొనసాగక దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో రక్తపోటు, మధుమేహం, హైపో థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక రోగులను గుర్తించి, వారిని '104' సేవలకు మ్యాపింగ్ చేసేవారు. దీంతో ఆ గ్రామానికి వెళ్లినప్పుడు వారు క్రమం తప్పకుండా మందులు వాడేలా చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కొందరు పీహెచ్‌సీల దారి పడుతుండగా, మరికొందరు విజయవాడలోని పెద్దాస్పత్రికి వస్తున్నారు.

వైద్యరంగాన్ని విస్మరించకూడదు



ప్రజలకు కావాల్సినది విద్య, వైద్యం. ఈ రెండు రంగాలను ఏ ప్రభుత్వాలు విస్మరించకూడదు. వైద్య ఖర్చులు భరించలేక నేడు ఎంతో మంది ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వాస్పత్రులతో పాటు, గ్రామీణ వైద్యాన్ని కూడా మరింత మెరుగుపర్చాలి. ఆరోగ్య కార్యక్రమాలను నిరాటంకంగా కొనసాగించాలి. ఎంతో మంది ప్రాణాలు నిలిపిన 108 సేవలు నిలిచిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– మునీర్ అహ్మద్ షేక్, కన్వీనర్, ముస్లీం జేఏసీ

'స్పెషలిస్టు' సేవలు దూరం



ఆరోగ్య సేవలు దిగజారాయి. గత ప్రభుత్వంలో ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్టు వైద్యులు గ్రామాలకే వచ్చి పరీక్షలు చేసేవాళ్లు. ఇప్పుడు స్పెషలిస్టు వైద్యులు కావాలంటే విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. అంతేకాదు ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రతి 15 రోజులకు గ్రామానికే వైద్యులు వచ్చి పరీక్షలు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– వజ్రాలు, తెన్నేరు, కంకిపాడు మండలం

'ఉపాధి' పథకంలో అవకతవకలు

అనిగండ్లపాడు గ్రామసభలో వెలుగు చూసిన వైనం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడులో ఉపాధి హామీ పథకంలో భారీ ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయి. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద 2023–24లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై చేసిన సోషల్‌ఆడిట్‌కు సంబంధించి శనివారం గ్రామసభ నిర్వహించారు. దీనిలో ఎన్నో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఒకే కుటుంబానికి రెండు జాబ్ కార్డులు ఇవ్వడంతోపాటు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వివిధ చోట్ల పనిచేసేవారికి మస్టర్లు వేసినట్లు, పనిచేయని దివ్యాంగురాలు కోట ప్రమీలకు జాబ్‌కార్డు ఇచ్చినట్లు, కొలతల్లో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సువార్త అనే మహిళ తన భర్త 15 ఏళ్ల క్రితం చనిపోయాడని ఎఫ్‌ఏ తన జాబ్‌కార్డు డిలీట్ చేశాడని, పని కావాలని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడని అధికారులకు వినతిపత్రం అందజేసింది. ఏపీఓకు చెప్పినా ఫలితం లేదని, అయితే మూడు రోజుల క్రితం తనకు జాబ్‌కార్డు ఇచ్చారంది. ఉపాధిలో అవకతవకలు జరిగాయని గ్రామానికి చెందిన రైతు గింజుపల్లి వేణుతో పాటు సుమారు 30 మంది తాము పనికి వెళ్లలేదని ఆడిట్ సిబ్బందికి తెలియజేశారు. గ్రామసభలో మాత్రం 30 మందిలో కొందరు పనికి వెళ్లామని సభ వద్ద చెప్పడం కొసమెరుపు. ఎఫ్‌ఏగా పనిచేసిన రమణ రాజీనామా చేశాడని, కొత్త వ్యక్తిని నియమించారని గ్రామస్తులు అంటున్నారు. ఎస్‌ఆర్‌పీ సూర్యనారాయణను వివరణకోరగా 2023–24కు సంబంధించి గ్రామంలో సుమారుగా రూ.2 కోట్ల పనులు జరిగాయన్నారు. బినామీ మస్టర్లు, ఒకే కుటుంబానికి రెండు జాబ్‌కార్డులు, కొలతల్లో తేడాలు గుర్తించామని, ఈ నెల 26న మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతిబ్రహ్మం, ఎంపీటీసీ సభ్యురాలు పొందూరు విజయలక్ష్మి, పశు వైద్యాధికారి పి.అనిల్, పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి



సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎంపీ బాలశౌరి, శాసనసభ్యులు, బ్యాంక్ అధికారులు

- జూన్ 20 వరకు నిరంతరాయంగా నీటి సరఫరా చేయాలి
- కౌలు రైతులు ప్రతి ఒక్కరికి రుణాలు ఇవ్వాల్సిందే : మంత్రి కొల్లు రవీంద్ర

చిలకలపూడి(మచిలీపట్నం): వేసవి కాలంలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ప్రాంతాలకు సరఫరా అయ్యేలా చూడాలని మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి అధికారులకు సూచించారు. జెడ్పీ కన్వెన్షన్ హాలులో డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశాన్ని ఎంపీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఏడాదిలోగా బందరు పోర్టు నిర్మాణం పూర్తవుతున్న దృష్ట్యా నియోజకర్గ పరిధిలోని పేద, బడుగు, బలహీనవర్గాల వారికి రుణాలు అందజేసి ఆర్థిక తోడ్పాటును అందించాలని ఆదేశించారు. జూన్ 20వ తేదీ వరకు ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు సరఫరా కావాలని, ఇందుకు ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సీఎస్‌ఆర్ నిధుల ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ అన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులందరికీ బ్యాంకర్లు రుణాలు విరివిగా ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో డొంక రోడ్లను నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు ఏ విధంగా జరుగుతుంది, వాటిలో లోటుపాట్లను సరిచేసుకుని పరిష్కరించుకోవడానికి ఈ సమావేశాన్ని నిర్వహించామన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, గుడివాడ మాజీ శాసనసభ్యులు రావి వెంకటేశ్వరరావు, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్, ఇండియన్ బ్యాంక్ సీజీఎం మల్లిక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ జీఎం దీపక్ కుమార్ శ్రీవాత్సవ, యూబీఐ డీజీఎం సీతారామారావు, ఐవోబీ డీజీఎం అమిత్‌కుమార్‌శుక్లా, నాబార్డు జీఎం డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, జిల్లా అధికారులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

'రెల్లి' వర్గానికి న్యాయమైన వాటా ఇవ్వాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణలో రెల్లి సామాజిక వర్గానికి న్యాయమైన వాటాను ఇవ్వాలని, దాని నిష్పత్తిని పెంచాలని రెల్లి మేధావుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బండి ఆది సురేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏపీ రెల్లి మేధావుల సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రెల్లి కార్పొరేషన్‌ను త్వరితగతిన పునరుద్ధరించాలన్నారు. ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రమణమూర్తి, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు మీసాల ఏడుకొండలు మాట్లాడుతూ ఎస్సీల్లోని 59 ఉపకులాల్లో మూడవ అతి పెద్ద ఉపకులానికి చెందిన రెల్లి, వాటి అనుబంధ కులాలు దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్నాయన్నారు. జనాభాను తక్కువగా చూపడంతో వర్గీకరణలో ఒక్క శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించడంతో అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు సోమీ కమల్, పాలెపు శివ కుమార్, ధనాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ఉద్యమాన్ని అవమానిస్తున్నారు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబు 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమాన్ని అవమానిస్తున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మండిపడ్డారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. ఎస్సీ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేయగలడని నమ్మి చంద్రబాబు మాదిగ జాతి ఓట్లు వేసిందన్నారు. కానీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించిన తర్వాత అందులో మార్పు చేసి చంద్రబాబు మాదిగలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందున్న మాలలకు 8 శాతం, ముప్పై ఏళ్లుగా ఉద్యమం చేస్తున్న మాదిగలకు 6 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా నివేదికలో మార్పులు చేయడాన్ని తప్పుబట్టారు. మాదిగలకు రిజర్వేషన్ తగ్గిస్తూ కేంద్రానికి పంపిన నివేదికను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా యూనిట్‌గా కాకుండా రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ చేయాలన్నారు. వర్గీకరణ పేరుతో మంద కృష్ణ మాదిగ చంద్రబాబుకు మాదిగలను తాకట్టు పెట్టారన్నారు. సమావేశంలో మందా నాగమల్లేశ్వర రావు, ఆలేటి ఏసుపాదం, పులిపాక ప్రవీణ్, పూనూరు జార్జి, ఎర్రంశెట్టి ప్రసాద్ రెల్లి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పేరుపోగు వెంకటేశ్వరరావు, ఇతర నేతలు

అలీనఖీపాలెంలో చెస్ట్ బీటింగ్

పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెంలో శనివారం ఇమాం అలీ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షియా ముస్లింలు గీతాలు ఆలపిస్తూ పీర్లను ఊరేగించారు. చెస్ట్ బీటింగ్‌తో రక్తం చిందించి నివాళులు అర్పించారు. మత గురువులు ప్రజలకు సందేశమిచ్చారు. ముస్లింలు పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు.



● సమ్మోహనం.. శాస్త్రీయ నృత్యం



పంచభూతాల ప్రాభవాన్ని చాటే సంప్రదాయ శాస్త్రీయ నృత్యం సందర్శకులను సమ్మోహన పరిచింది. మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన సంప్రదాయ నృత్యహేల అబ్బురపర్చింది. కేరళకు చెందిన అనుపమామోహన్ చేసిన నృత్య కార్యక్రమం నిర్వహించారు. కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. - సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ

వచ్చే ఏడాదికి పోర్టు పూర్తి చేయాలి

కోనేరుసెంటర్: వచ్చే ఏడాది జూన్ నాటికి బందరు ఓడరేవు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర గనులు భూగర్భవనరుల ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ డీకే బాలాజీలతో కలసి బందరు ఓడరేవు నిర్మాణ పనులను పరిశీలించారు. తొలుత ఓడరేవు ప్రాజెక్టు కార్యాలయంలో పీపీటీ ద్వారా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి వివరాలను మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పోర్టు నిర్మాణ పనులు ప్రస్తుతం 37 శాతం పూర్తయ్యాయన్నారు. బందరు ప్రజలకు బంగారు భవిష్యత్తు రావాలంటే నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించామన్నారు. గత ఏడాది చంద్రబాబు ఓడ రేవు పనులను పరిశీలించారన్నారు. మొత్తం 4 బెర్తుల పైలింగ్ పూర్తయిందని, ప్లాట్‌ఫామ్ చేయాల్సి ఉందన్నారు. ఓడలు రావడానికి ఆరు డ్రెడ్జింగ్ పనులు మొత్తం 15 మీటర్లు పని జరుగుతోందన్నారు. 200 మీటర్ల రహదారి, రైల్వే లైను పూర్తవుతోందన్నారు. ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు మాట్లాడుతూ ఓడరేవు ఆధారిత పరిశ్రమలు ఇంకా రావాల్సి ఉందన్నారు. పర్యటనలో మారిటైమ్ బోర్డు సీఈ పల్లా రాఘవరావు, కెప్టెన్ రామ, ఇంజనీర్లు శ్రీనివాసరావు, సతీష్, ఆర్డీఓ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు మోడల్ గోకులం

మచిలీపట్నం మండలం తాళ్లపాలెంలో రాష్ట్రానికే తలమానికంగా ఒక మోడల్ గోకులాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం మంత్రి మండలంలోని తాళ్లపాలెం మంగినపూడి బీచ్ వద్ద గోకులం ఏర్పాటుకు అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలు ఉన్నాయని, రూ.50 లక్షలకు కూడా గోకులాలు నిర్మించుకోవచ్చని, ఆ ప్రకారం 2 యూనిట్లుగా కోటి రూపాయలతో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. మంత్రి వెంట డ్వామా పీడీ శివ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు



బందరు పోర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ నారాయణ తదితరులు

క్లుప్తంగా

27న ఉప సర్పంచుల ఎన్నికలు

విజయవాడరూరల్: ఎన్టీఆర్ జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ ఉప సర్పంచుల ఎన్నికలు ఈ నెల 27వ తేదీన నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్య కుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ విస్తరణ అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, వత్సవాయి మండలం మంగోలు, ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం, జి.కొండూరు మండలం కట్టుబడిపాలెం పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరుగుతాయని లావణ్య కుమారి తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు, పాలకవర్గ సభ్యులు 27వ తేదీన ప్రత్యేక సమావేశంలో పోటీ చేసే ఉప సర్పంచి అభ్యర్థులను చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకుంటారని వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పటమట(విజయవాడ తూర్పు): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించామని సీఐ పవన్ కిషోర్ శనివారం తెలిపారు. ఆటోనగర్ మొదటి రోడ్డులో ఉన్న కావేరి లాడ్జ్ పక్కన సుమారు 35 నుంచి 38 సంవత్సరాలు వయసు కలిగిన పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలిచామని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పటమట పోలీస్ స్టేషన్‌లో లేదా పోలీస్ స్టేషన్ నంబర్ 0866–2542333, సబ్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్ 83418 25137 సంప్రదించాలని కోరారు.

'పసుపు పచ్చ'గా పోలీసుల విధులు

- ధర్మాన్ని, న్యాయాన్ని వదిలి చట్టాన్ని టీడీపీ చుట్టంగా మార్చారు
- 16 మందిని అన్యాయంగా జైలు పాలు చేశారు
- తప్పుడు కేసులు మోపిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- వైఎస్సార్ సీపీ నేతలు పేర్ని నాని, దేవినేని అవినాష్, తన్నీరు నాగేశ్వరరావు
- సబ్‌జైలులో ఉన్న పెనుగంచిప్రోలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పరామర్శ



సబ్‌జైలు వద్ద కార్యకర్తల కుటుంబ సభ్యులతో వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ని నాని, దేవినేని అవినాష్, తన్నీరు నాగేశ్వరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామని ఉద్యోగంలో చేరినప్పుడు ప్రమాణం చేసిన పోలీసులు నేడు పసుపుపచ్చగా విధులు నిర్వర్తిస్తున్నారని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) విమర్శించారు. పోలీసులు మోపిన అక్రమ కేసులతో మచిలీపట్నంలోని స్పెషల్ సబ్ జైలులో ఉన్న పెనుగంచిప్రోలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావుతో కలిసి పేర్ని నాని శనివారం పరామర్శించారు. అనంతరం పేర్ని నాని మాట్లాడుతూ.. పెనుగంచిప్రోలు తిరునాళ్లలో పోలీసుల సమక్షంలోనే టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని, విద్వేషపూరితంగా మాట్లాడుతూ రెచ్చగొట్టారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభలపై రాళ్లు విసిరేసి నోటికి వచ్చినట్లు దుర్భాషలాడారని, టీడీపీ వాళ్లు రెచ్చగొడుతున్నా పోలీసులు కనీసం కట్టడి చేయలేదని విమర్శించారు. జాతరలో గొడవ జరిగినప్పుడు లేని వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పోలీసులు ముద్దాయిలుగా చేర్చారన్నారు. సోషల్ మీడియాలో క్రియాశీలంగా ఉన్న వారిపై అన్యాయంగా, అక్రమంగా కేసులు కట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ రాష్ట్రంలో చట్టం, ధర్మం, న్యాయం ఉందా అని ప్రశ్నించారు. పోలీసులను చంపబోయారని వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలులో పెట్టారని పేర్కొన్నారు. పోలీసులు ఇప్పటికైనా ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. ధర్మాన్ని, న్యాయాన్ని వదిలేసి చట్టాన్ని టీడీపీకి చుట్టంగా మార్చి తప్పుడు కేసుల్లో ఇరికించిన వారిని తాము వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెల్చిచెప్పారు.

అక్కసుతోనే కేసులు

దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. జాతరలో వైఎస్సార్ సీపీ ప్రభను మూడు గంటలపాటు ఆపివేసి టీడీపీ నాయకులు వేసిన రాళ్లు తగిలితే వైఎస్సార్ సీపీ కార్యకర్తలను, పార్టీలో యాక్టివ్‌గా పని చేస్తున్నారన్న అక్కసుతో కేసులు పెట్టారని విమర్శించారు. పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారికి శిక్ష పడే వరకు తాము పోరాటం చేస్తామన్నారు. అతి తొందరల్లోనే కార్యకర్తలను బయటకు తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. తమ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు తాము కార్యకర్తలను పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యం చెప్పామన్నారు.

తప్పుడు కేసులు పెట్టారు

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు కావాలనే దుర్భాషలాడుతూ దాడి చేసినప్పటికీ పోలీసులు ఏకపక్షంగా సాక్ష్యాధారాలు సేకరించకుండా తప్పుడు కేసులు పెట్టారని విమర్శించారు. 30 సంవత్సరాల్లోపు యువకులు, గ్రాడ్యుయేట్లను నిందితులుగా చేర్చారని పేర్కొన్నారు. కూటమి నాయకులు కేసులు పెడితే పార్టీ బలహీన పడుతుందని అనుకోవడం భ్రమేనన్నారు. తప్పుడు కేసులకు బాధ్యులైన వారిని వదిలిపెట్టబోమని పేర్కొన్నారు. అనంతరం సబ్‌జైలు వద్ద ఉన్న బాధిత కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించారు.

జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

పెనుగంచిప్రోలు: స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 18న తెల్లవారుజామున పోలీసులు గాయపడిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ విచారణ జరిపించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవి కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం పెనుగంచిప్రోలులో విలేకరులతో మాట్లాడారు. జగ్గయ్యపేట సీఐ, పెనుగంచిప్రోలు ఎస్‌ఐ అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ విధులను సక్రమంగా నిర్వర్తించలేదన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై, వారి వైపున ఉన్న పోలీసులపై టీడీపీ శ్రేణుల వైపు నుంచి రాళ్లు వేస్తే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లు విసిరిన వీడియోలు, ఆ సందర్భంగా పోలీసులు నవ్వుతూ టీడీపీ నాయకులతో వ్యవహరించిన వీడియోలు ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కేసులో ఎంబీబీఎస్ విద్యార్థితోపాటు పాటు అమ్మ వారికి సేవలందిస్తున్న పాపమాంబ వంశీకుడిని కూడా అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు



జస్టిస్ రవినాథ్ తిలహరికి పూల మొక్కలు అందజేస్తున్న జిల్లా న్యాయమూర్తి అరుణసారిక , కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరిని కృష్ణా జిల్లా అధికారులు పలువురు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మచిలీపట్నంలోని బెల్ అతిథి గృహానికి చేరుకున్న జస్టిస్ రవినాథ్ తిలహరిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక, కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర రావు, ఆర్డీఓ స్వాతి పూల మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. జిల్లా కోర్టు న్యాయమూర్తులు చిన్నంశెట్టి రాజు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య, విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.సత్యానంద్, విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, బందరు డీఎస్పీ సీహెచ్.రాజా, బందరు తహసిల్దారు మధుసూదన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో టీమ్ లీడర్, ట్రైనర్స్, కస్టమర్ సపోర్ట్ అసోసియేట్స్–80 ఉద్యోగాలు, కోస్టల్ న్యూమటిక్ ఏజెన్సీలో సేల్స్ రిప్రజెంటివ్స్, సర్వీస్ టెక్నీషియన్స్–14 పోస్టులతో పాటుగా పలు సంస్థల్లో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, బీబీఏ విద్యార్హత గల 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు జాబ్‌మేళాలో పాల్గొనడానికి అర్హులని సూచించారు. ఈ నెల 25వ తేదీలోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 97000 25833, 99888 53335 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంతర్ జిల్లాల దొంగ కిరణ్‌బాబు దంపతుల అరెస్టు

రూ.14 లక్షల విలువైన సొత్తు రికవరీ



కిరణ్‌బాబు దంపతులతో డీఎస్పీ శ్రీవిద్య, సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

ఘంటసాల: మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న అంతర్ జిల్లా దొంగలు కె.కిరణ్‌బాబు దంపతులను ఘంటసాల పోలీసులు శనివారం అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఘంటసాల స్టేషన్ వద్ద అవనిగడ్డ డీఎస్పీ టి.శ్రీవిద్య ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఆమె కథనం మేరకు.. మండలంలోని శ్రీకాకుళం శివారు శీలంవారిపాలెం శ్రీకోదండరామాలయంలో ఈ నెల పదో తేదీ అర్ధరాత్రి చోరీ జరిగింది. నాలుగు వెండి కిరీటాలు, బంగారు మంగళసూత్రం, రాములవారికి వేసిన వెండి జంధ్యం, వెండి బొట్టు, పళ్లెం, వెండి శఠగోపం చోరీకి గురయ్యాయి. 11న ఈ ఘటనపై ఆలయ కమిటీ నుంచి పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు, క్లూస్ టీమ్ సభ్యులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు డీఎస్పీ టి.శ్రీవిద్య పర్యవేక్షణలో చల్లపల్లి సీఐ కోవిలపు ఈశ్వరరావు, ఘంటసాల ఎస్ఐ కల్లూరు ప్రతాప్ రెడ్డి నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీ ద్వారా నిందితులను గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానంతో శనివారం సాయంత్రం శ్రీకాకుళం కరకట్టపై నిందితులు కారులో వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. తక్కువ సమయంలో నిందితులను అరెస్టు చేసిన సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించడంతో పాటు సిబ్బంది శివాజీ, వీరబాబు, మనోహర్, అశోక్, చంద్రశేఖర్, నాగరాజుకు రివార్డు అందించారు.

విచారణలో కళ్లుచెదిరే నిజాలు

బీటెక్ చదివి ఉద్యోగం చేస్తూ విలాసాలకు అలవాటు పడిన కిరణ్‌బాబు పెదపులిపాక వచ్చి ఏడాదిన్నర క్రితం ఆదాంబిని పెళ్లి చేసుకున్నాడు. 2022 నుంచి 2025 ఐదు ఆలయాల్లో చోరీలు చేసి పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. అంతర్ జిల్లా దొంగగా మారిన కిరణ్ బాబు చేసిన చోరీలు పోలీసుల విచారణలో వెలుగుచూశాయి. శ్రీకాకుళం శివారు శీలంవారిపాలెం రామాలయంలో చోరీచేసిన వెండి వస్తువులను భార్య ఆదాంబీ సాయంతో కిరణ్‌బాబు మిషన్ ద్వారా కరిగించాడు. భర్తతో కలసి శీలంవారిపాలెంలో జరిగిన చోరీలో పాల్గొన్న ఆదాంబీ కూడా పోలీసులకు చిక్కింది. పదేళ్లుగా ఆలయాలే కేంద్రంగా చోరీలు చేస్తున్న కిరణ్‌బాబు 34 కేసుల్లో జైలుకు వెళ్లొచ్చాడు. 2022లో చీరాల పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.50 వేల విలువైన బంగారుహారం, 2024లో పామర్రు దేవాలయంలో 4.230 కిలోల వెండి, గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలయంలో 2.257 కిలోల వెండి, విస్సన్నపేట ఆలయంలో రూ.5.5 కిలోల వెండి మొత్తం రూ.14 లక్షల విలువైన 13.5 కిలోల వెండి, నాలుగు గ్రాముల బంగారు నగలు, వెండిని కరిగించే యంత్రాలు, చోరీలకు వినియోగించిన రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

టెన్త్ పరీక్షల్లో నిర్లక్ష్యం.. టీచర్‌పై వేటు

- కొత్త సిలబస్‌కు బదులు పాత సిలబస్ పేపర్ ఇచ్చిన వైనం
- సీఎస్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు
- సంస్కృతం పరీక్షకు 29 మంది గైర్హాజరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): టెన్త్ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయినిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు ప్రకటించారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని డాన్‌బాస్కో ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) ఎస్.శైలజ సంస్కృతం పరీక్షకు సంబంధించి కొత్త సిలబస్ విద్యార్థులకు పాత సిలబస్ ప్రశ్న పత్రాన్ని అందించింది. పరీక్ష సమయం ముగింపు దశకు వచ్చే వరకూ ఆమె దానిని గమనించలేదు. ఈ నేపథ్యంలో ఆమెను సస్పెండ్ చేసినటుల డీఈఓ ప్రకటించారు. ఆ కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కె.జె.ఎస్.లక్ష్మి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జె.విద్యాసాగర్‌ను బాధ్యులను చేస్తూ షోకాజ్ నోటీసులను జారీ చేశారు.

పరీక్షకు 6,162 మంది హాజరు

జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన కాంపోజిట్ కోర్సు సంస్కృతం పరీక్షకు 29 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో శనివారం 137 కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. 6,191 మంది విద్యార్థులకు 6,162 మంది పరీక్షకు హాజరయ్యారు. విజయవాడ పూర్ణానందంపేటలోని ఎస్‌కేఎస్ ఎంసీ ఉన్నత పాఠశాల, ముత్యాలంపాడు అమలి ఉన్నత పాఠశాల, జీఎస్ఆర్ ఎంసీ ఉన్నత పాఠశాల తదితర పరీక్ష కేంద్రాలను డీఈఓ సుబ్బారావు తనిఖీచేశారు.

టెన్త్ సంస్కృతం పేపర్ తారుమారు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్థానిక డాన్‌బాస్కో స్కూల్ పరీక్ష కేంద్రంలో టెన్త్ క్లాస్ సంస్కృతం పేపర్ -2 ప్రశ్నపత్రం తారుమారు కావడంతో గందరగోళం ఏర్పడింది. పరీక్షల చీఫ్ సూపర్‌వైజర్, డిపార్ట్‌మెంట్ అధికారి, ఇన్విజిలేటర్ చేసిన పొరపాటుతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నెల 17వ తేదీన సంస్కృతం పేపర్ -1 రాసిన విద్యార్థులకు శనివారం సంస్కృతం–2 నిర్వహించారు. డాన్‌బాస్కోలో ఆరుగురు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆరుగురిలో ముగ్గురు కంపార్ట్‌మెంట్ కాగా మరో ముగ్గురు రెగ్యులర్ విద్యార్థులు. రెగ్యులర్ వారికి మారిన సిలబస్ మేరకు నూతన పేపర్, కంపార్ట్‌మెంట్ వారికి పాత సిలబస్ పేపర్ ఇవ్వాల్సి ఉంది. దీనిని గమనించని ఇన్విజిలేటర్ ముగ్గురు రెగ్యులర్ విద్యార్థులకు కంపార్ట్‌మెంట్ విద్యార్థుల పాత సిలబస్ పేపర్ అందించారు. పరీక్ష రాసి బయటకు వచ్చిన విద్యార్థులు పొరపాటును గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరిన తల్లిదండ్రులు పరీక్షల సిబ్బందిని నిలదీశారు. తమ విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. చీఫ్ సూపర్ వైజర్, ఇన్విజిలేటర్ సరైన సమాధానం చెప్పకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పి వెళ్లిపోయారు.

విద్యార్థులకు సహాయక చర్యలు

- ప్రకాశం జిల్లాలో రోడ్డు ప్రమాదం
- నలుగురు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులకు ఫ్యాక్చర్లు



డీఈఓ కార్యాలయం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున కృష్ణాజిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో విజ్ఞాన, విహార యాత్రకు వెళ్లిన టూరిస్ట్ బస్సు ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొనటంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 27 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ ప్రమాదంలో 12 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులకు గాయాలు కావటంతో ఒంగోలులోని రిమ్స్ ఆస్పత్రికి 108 వాహనాల ద్వారా హుటాహుటిన తరలించారు. నాగాయలంక, గుడివాడ, అరుగొలను, పెదపులిపాక పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు, మొవ్వ, పామర్రు పాఠశాలలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఫ్యాక్చర్లు కాగా కట్లు కట్టారని డీఈఓ పి.వి.జె.రామారావు తెలిపారు. ఎవరికీ తీవ్రగాయాలు కాలేదని చికిత్స అనంతరం ప్రత్యేక వాహనాల ద్వారా వారి గృహాలకు తరలించామని పేర్కొన్నారు. ఉయ్యూరు డీవైఈఓ, పలువురు విద్యాశాఖాధికారులను ఒంగోలు పంపి సహాయక చర్యలను చేపట్టామన్నారు. డీఈఓ కార్యాలయానికి విద్యార్థులను చేర్చి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించామని తెలిపారు.

మహిళపై పెట్రోల్ పోసి హత్యాయత్నం

- ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తి ఘాతకం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఓ మహిళపై ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తి అనుమానంతో పెట్రోల్‌పోసి నిప్పంటించిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ సమీపంలో వీర్ల చంద్రకళ(48) నివసిస్తోంది. ఆమెకు గతంలో ప్రసాద్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు సంతానం. 2003లో ప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడు. చంద్రకళ వంట పనికి వెళ్లే క్రమంలో పరిచయమైన తుమ్మపల్లి పుల్లారావుతో సహజీవనం చేస్తోంది. వారిద్దరు కేఎల్‌రావు నగర్ కుండల మార్కెట్ వద్ద ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. మద్యం అలవాటు ఉన్న పుల్లారావు కొంత కాలంగా చంద్రకళను వేధిస్తున్నాడు. మూడు రోజుల కిందట పుల్లారావు చంద్రకళతో గొడవపడి చంపేస్తానని బెదిరించాడు. చంద్రకళ శుక్రవారం తన ఇంటికి సమీపంలోని ఇనుప కొట్లో పనికెళ్లగా, పుల్లారావు ఇంటికి వచ్చాడు. చంద్రకళ ఇంట్లో లేకపోవడంతో వెంటనే ఆమెకు ఫోన్ చేసి తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఇంటికి రావాలని కోరాడు. ఆ రాత్రి ఇద్దరు భోజనం చేసి నిద్రించారు. తెల్లవారుజామున నిద్రలో ఉన్న చంద్రకళకు వంటిపై తడిగా ఉన్నట్లు అనిపించి నిద్ర లేచే సరికి పుల్లారావు బాటిల్‌తో తెచ్చిన పెట్రోల్ తనపై పోస్తూ కనిపించాడు. ఆమె తేరుకునే లోపు పుల్లారావు ఇంటి తలుపులు దగ్గరకు వేసి, ఆ సందులో నుంచి అగ్గిపుల్ల వెలిగించి పడేశాడు. మంటల్లో చిక్కుకున్న చంద్రకళ కేకలు వేస్తూ బాత్‌రూమ్ వద్దకు చేరుకుని నీరు పోసుకునేందుకు ప్రయత్నించి, సాధ్యం కాక రోడ్డుపైకి వచ్చి కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పి ఆమెను 108 ద్వారా విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు చంద్రకళ నుంచి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు.



